మరోసారి తప్పు చేయొద్దు



పార్టీలో చేరిన కార్యకర్తలతో నరేందర్, అశోక్‌యాదవ్

మణికొండ: గత ఎమ్మెల్యే ఎన్నికల్లో ఎక్కువ మంది కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయక చేసిన తప్పుతో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినా నియోజకవర్గంలో ఎమ్మెల్యే ఇతర పార్టీ వారు ఉన్నారని, అదే తప్పును ఎంపీ ఎన్నికల్లో చేయొద్దని నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి, మణికొండ మున్సిపల్ చైర్మన్ నరేందర్‌ముదిరాజ్ అన్నారు. ఆదివారం కాంగ్రెస్ పార్టీ నార్సింగి మున్సిపాలిటీ అధ్యక్షుడు అశోక్‌యాదవ్ ఆధ్వర్యంలో వట్టినాగులపల్లి గ్రామానికి చెందిన ఇతర పార్టీలకు చెందిన కార్యకర్తలు నరేందర్‌ముదిరాజ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మన నియోజకవర్గంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే లేక పోయినా ప్రభుత్వం నుంచి నియోజకవర్గానికి అవసరమైన నిధులను రాబట్టి అభివృద్ధి చేసేందుకు తాను సిద్ధంగా ఉన్నామన్నారు. ఎమ్మెల్యే లేనందున ఎంపీని గెలిపించుకుంటే ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలను వారధిలా పని చేస్తారన్నారు. పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో ప్రధాన సమస్యలపై అవగాహన ఉన్న నాయకుడు రంజిత్‌రెడ్డి అని అతని భారీ మెజార్టీతో గెలిపించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రాజేందర్‌రెడ్డి, ధర్మపురి, శిశుపాల్‌సింగ్, తాతాసిం, శేఖర్, గణేష్ సింగ్, అరుణ్‌కుమార్, సాయిరాం, సాయికుమార్, శ్రీకాంత్, మధుయాదవ్, భవన్‌సాయి పాల్గొన్నారు.

ఆదరించండి.. అండగా ఉంటాం !



మాట్లాడుతున్న డాక్టర్ రంజిత్‌రెడ్డి



అల్పాహారం కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ రంజిత్‌రెడ్డి

చేవెళ్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి

హఫీజ్‌పేట్: కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి ఆదరిస్తే తామంతా అండగా ఉంటామని చేవెళ్ల పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ రంజిత్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మాదాపూర్ డివిజన్ పరిధిలోని సుభాష్ చంద్రబోస్ కాలనీలో ఇమ్రాన్ చౌదరి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో అభివృద్ధే ప్రధాన ఎజెండాగా ముందుకు సాగుతున్నామని, తనను గెలిపిస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి ..

హఫీజ్‌పేట్: రాష్ట్ర ప్రభుత్వం తరపున కాలనీల్లో నెలకొన్న అన్ని రకాల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చేవెళ్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ రంజిత్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం చందానగర్ డివిజన్ పరిధిలోని అపర్ణ గేటెడ్ కమ్యూనిటీలో కాలనీ అసోసియేషన్ సభ్యులతో అల్పాహారం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. హస్తం గుర్తుకు ఓటువేసి కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. కమ్యూనిటీలో నెలకొన్న సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానన్నారు. సంక్షేమ పథకాలు కనుమరుగయ్యాయనని, కార్పొరేట్ శక్తుల కోసమే బీజేపీ ప్రభుత్వం పని చేస్తుందని విమర్శించారు. పేద, మధ్యతరగతి ప్రజల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించారని ఆరోపించారు.

ఘనంగా సౌత్ ఇండియా ఐకాన్ అవార్డుల ప్రదానం

రాయదుర్గం: సౌత్ ఇండియా ఐకాన్ అవార్డుల ప్రదానోత్సవం అట్టహాసంగా నిర్వహించారు. వివిధ రంగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 10 మందికి ఈ అవార్డులను ప్రదానం చేశారు. హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీ-హబ్‌లో 'కమ్యూనిటీ ఆఫ్ ఎంటర్‌ప్రెన్యూర్స్', బ్లాగర్స్, ఇన్‌ఫ్లూయెన్సర్స్, యూట్యూబర్స్, న్యూ స్టార్టప్స్‌ల సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని శనివారం రాత్రి నిర్వహించారు. అంతర్జాతీయ టెన్నీస్ క్రీడాకారిణి సానియా మీర్జా సోదరి ఆనమ్ మీర్జా ముఖ్య అతిథిగా హాజరై గిఫ్ట్ హ్యాంపర్లను పంపిణీ చేశారు. సాదియా కుర్షీద్, ప్రవీణ్, గుల్నార్ ఈవెంట్స్ ప్రతినిధి సుప్రియోచక్రబర్తి, బగ్గా, ఫుడ్ బ్లాగర్ ఆయేషా జరీన్, భుక్కా నవాబ్, ట్రావెల్ బ్లాగర్ అమీర్ అహ్మద్, హీనాభాటియా, దనపట్ రాజ్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల్లో బీఆర్‌ఎస్‌పై తగ్గని ఆదరణ



గచ్చిబౌలి మాజీ కార్పొరేటర్ సాయిబాబా

రాయదుర్గం: ప్రజల్లో బీఆర్‌ఎస్ పట్ల ఆదరణ తగ్గలేదని, అది మరింత పెరిగిందని గచ్చిబౌలి మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టిసాయిబాబా పేర్కొన్నారు. గచ్చిబౌలి డివిజన్ ఖాజాగూడలోని బీఆర్‌ఎస్ పార్టీ డివిజన్ కార్యాలయంలో రాయదుర్గంకు చెందిన పలువురు యువకులు ఆదివారం బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి బీఆర్‌ఎస్ పార్టీ కండువాలను కప్పి ఆయన పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పార్టీ పట్ల యువత, మహిళలు ఆసక్తి కనబరుస్తున్నారన్నారు. చేవెళ్లలో బీఆర్‌ఎస్ పార్టీ మరోసారి ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ఎమ్మెల్యే గాంధీ నాయకత్వంలో అత్యధిక మెజార్టీ సాధనే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. ప్రజలు దీనికి సహకరించాలని ఆయన కోరారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్యప్రదర్శన



శిల్పారామంలో కూచిపూడి ప్రదర్శన చేస్తున్న కళాకారులు

మాదాపూర్: మాదాపూర్‌లోని శిల్పారామంలో అంతర్జాతీయ నృత్యోత్సవం సందర్భంగా ఆదివారం అభినయావని నృత్యానికేతన్ నాట్య గురువు చావళిబాల త్రిపురసుందరి శిష్య బృందంచే కూచిపూడి నృత్య ప్రదర్శనను ప్రదర్శించి సందర్శకులను ఆకట్టుకున్నారు. గణేశకౌతం, వందే మహేశ్వరం, వసంత స్వరజతి, నారాయణతే, రామాయణశబ్దం, భావయామి, తిల్లాన తదితర అంశాలను కళాకారులు సంజన, అనురిత, సహన, యజ్ఞ, ప్రియసిని, చైత్రహాసిని, సౌమ్య, సంయుక్త, శశికళ, వైష్ణవి, మృత్యుంజయశర్మ, సర్వాణిలు ప్రదర్శించి అలరించారు.

బీజేపీతోనే అన్ని వర్గాలకు సమన్యాయం

కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

రాజేంద్రనగర్: బీజేపీ పార్టీతోనే అన్ని వర్గాలకు సమన్యాయం జరుగుతోందని చేవెళ్ల లోక్‌సభ బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం ఆయన పార్టీ శ్రేణులతో కలిసి రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని అత్తాపూర్, బుద్వేల్, రాజేంద్రనగర్, శివరాంపల్లి, రాఘవేంద్రనగర్, ఆరాంఘర్, మైలార్‌దేవ్‌పల్లి,మధుబన్ కాలనీల్లో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చేవెళ్లలో నాలుగు లక్షల మంది ముస్లిం ఓట్లు ఉన్నాయని రంజిత్ రెడ్డి చెప్పుకోవడం సిగ్గుచేటని మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీ ముస్లిం మైనారిటీ ఓటు బ్యాంకుగానే చూసింది తప్ప వారి అభ్యున్నతికి ఎలాంటి కృషి చేయలేదని ఆరోపించారు. బీజేపీ పాలనలో నరేంద్ర మోదీ సర్కార్ ముస్లింల అభ్యున్నతికి పాటుపడిందన్నారు. రాష్ట్రంలో బీజేపీదే హవా నడుస్తుందని తెలంగాణలో 12 పార్లమెంట్ స్థానాలలో బీజేపీ స్పష్టమైన మెజారిటీ వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ మోసపూరిత హామీలతో అసెంబ్లి ఎన్నికల్లో విజయం సాధించినదని కానీ.. లోక్‌సభ ఎన్నికల్లో రేవంత్ రెడ్డి పప్పులు ఉడకవన్నారు. ప్రచారంలో తోకల శ్రీనివాస్‌రెడ్డి, మల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిక..

మైలార్‌దేవ్‌పల్లి: భారత ప్రధాని మోదీని మూడోసారి ప్రధానిగా చూడాలని దేశ ప్రజలు కోరుకుంటున్నారని చేవెళ్ల బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలో ప్రచారంలో భాగంగా సంరెడ్డి ప్రమోద్‌రెడ్డితో పాటు పలువురు బీజేపీలో చేరగా వారికి ఆయన పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ..బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యమన్నారు.



ప్రచారంలో పాల్గొన్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



బీజేపీతోనే అభివృద్ధి..

అత్తాపూర్: బీజేపితోనే దేశ సమగ్రాభివృద్ధి సాధ్యమని కొండా విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. అత్తాపూర్ డివిజన్‌లో ఆదివారం నిర్వహించిన రోడ్ షోలో భాగంగా అనిల్ బీజేపీలో చేరగా ఆయనకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మోదీ చేసే అభివృద్ధి పనులు చూసి ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ మల్లేష్‌యాదవ్, పార్లమెంట్ కన్వీనర్ మల్లారెడ్డి, జిల్లా కార్యదర్శి కొమురయ్య, శ్రీధర్, అంజన్ కుమార్, బాల్‌రెడ్డి, అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ సంగీత గౌరీ శంకర్ పాల్గొన్నారు.

నేడు కేటీఆర్ సమక్షంలో భారీ చేరికలు

బండ్లగూడ: అన్ని వర్గాల సంక్షేమం బీఆర్‌ఎస్ పార్టీతోనే సాధ్యమవుతుందని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు అంతారం నరేష్ అన్నారు. గత మార్చి నెలలో బీఆర్‌ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరిన నాయకులు తిరిగి సోమవారం తమ సొంత గూటికి చేరుతున్నారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ మహేందర్‌గౌడ్, కార్పొరేటర్లు శ్రీలతసురేష్‌గౌడ్, సాగర్‌గౌడ్, పద్మావతి పాపయ్యయాదవ్, సురేష్‌గౌడ్ కాంగ్రెస్ చేరారని సోమవారం వారు కేటీఆర్ సమక్షంలో మళ్లి బీఆర్‌ఎస్ చేరుతున్నారన్నారు.

విద్యుదాఘాతంలో ఎలక్ట్రీషియన్ మృతి



శ్రీనాథ్

శంషాబాద్ రూరల్: స్విమ్మింగ్ పూల్‌లో మోటారు మరమ్మతులు చేస్తుండగా కరెంటు షాక్ తగిలి ఎలక్ట్రీషియన్ మృతి చెందిన ఘటన చౌదరిగూడలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. సుల్తాన్‌పల్లికి చెందిన మైలారం శ్రీనాథ్(38) ఎలక్ట్రిక్ పని చేస్తుంటాడు. చౌదరిగూడలోని ఆపిల్ వెంచర్‌లో ఉన్న ఫాంహౌస్‌లో స్విమ్మింగ్ పూల్ మోటారు మరమ్మతు చేయడానికి ఆదివారం వెళ్లాడు. మరమ్మతులు చేస్తుండగా కరెంటు షాక్ తగిలి మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడు శ్రీనాథ్ సోదరి పెళ్లి నాలుగు రోజుల కిందట జరిగింది. ఇంతలోనే అతని మృతితో గ్రామంలో విషాదం నెలకొంది.

మహిళ ఆత్మహత్యాయత్నం

రక్షించిన పోలీసులు

రాంగోపాల్ పేట్ : కుటుంబ కలహాలతో మహిళ ఆత్మహత్యయత్నానికి పాల్పడిన ఘటన సెక్రటేరియేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. అత్తాపూర్ కు చెందిన ఓ మహిళ (33)కు వివాహమై 8 ఏళ్లు అవుతోంది. సంతానం కలగకపోవడంతో అత్తింటి వేధింపులు ఎక్కువయ్యాయి. రోజు రోజుకు వేధింపులు ఎక్కువవడంతో మనోవేదనకు గురవుతూ వచ్చింది. ఆదివారం మధ్యాహ్నం సెక్రటేరియేట్ నార్త్ ఈస్ట్ గేట్ ఎదురుగా హుస్సేన్ సాగర్ జలాశయాల్లో దూకి ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించింది. సెక్రటేరియట్ గేటు వద్ద విధులు నిర్వహిస్తున్న మహిళా కానిస్టేబుల్ టీఎస్ఎస్పీ కానిస్టేబుల్ అశోక్ ను అప్రమత్తం చేయగా, అశోక్ వెంటనే ఆ మహిళను కాపాడి సెక్రటేరియేట్ పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు కుటుంబ సభ్యులను రప్పించి ఆ మహిళతో పాటు వారికి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు.

అసదుద్దీన్ ఒవైసీని భారీ మెజార్టీతో గెలిపించాలి

యాకుత్‌పురా: యాకుత్‌పురా నియోజకవర్గం పరిధిలోని పలు ప్రాంతాల్లో ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ ఆదివారం ప్రచారం నిర్వహించారు. యాకుత్‌పురా లబైక్ హోటల్, రెయిన్ బజార్ చమన్, అన్‌మోల్ హోటల్ తదితర ప్రాంతాల్లో ఇంటింటికీ తిరుగుతూ హైదరాబాద్ ఎంపీ అభ్యర్థి అసదుద్దీన్ ఒవైసీని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాతబస్తీ ప్రజల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తున్న తమ పార్టీ అధినేత అసదుద్దీన్ గెలుపును ఏ శక్తులు ఆపలేవన్నారు. ఈ కార్యక్రమంలో తలాబ్ చంచలం, రెయిన్ బజార్, పత్తర్‌గట్టి కార్పొరేటర్లు డాక్టర్ సమీనా బేగం, మహ్మద్ వసీవుద్దీన్, సయ్యద్ సోహెల్ ఖాద్రీ, మజ్లిస్ పార్టీ యాకుత్‌పురా ఇన్‌చార్జి యాసర్ అరాఫత్ పాల్గొన్నారు.

ఓటుహక్కుపై అవగాహన



మైహోమ్ భుజాలో అవగాహన కల్పిస్తున్న దృశ్యం

గచ్చిబౌలి: పోలింగ్ శాతం పెంపునకు అధికారులు చేసే ప్రయత్నానికి ఓటర్లంతా సహకరించాలని వక్తలు పిలుపునిచ్చారు. ఆదివారం హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని బయోడైవర్సిటీ పార్కు ప్రాంతంలోని మైహోమ్ భూజాలో స్వీప్, జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఓటుహక్కు ఉన్న వారంతా విధిగా తమ హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఓటు వేస్తేనే ప్రజాస్వామ్య లక్ష్యం నెరవేరుతుందన్నారు. నగరాల్లో ఓటింగ్ శాతం తగ్గుతుందనే ఆందోళన అందరిలోనూ వస్తుందని, దీనికి భిన్నంగా ఓటర్లకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. పోలింగ్ శాతం పెంచేందుకే అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ప్రజలంతా తమ ఇరుపొరుగు వారిని ఓటువేసేలా ప్రోత్సహించాలన్నారు. జీహెచ్‌సీయూ యూసీడీ అదనపు కమిషనర్ డాక్టర్ సీఎస్‌రాజు, ఫెసిలిటీ మేనేజర్ అధ్యక్షుడు గోపీనాథ్‌రెడ్డి, చంద్రకాంత్‌రెడ్డి, జీహెచ్‌ఎంసీ అధికారులు, గేటెడ్ కమ్యూనిటీవాసులు పాల్గొన్నారు.

అధ్వానంగా పార్కులు



గోల్కొండ: గోల్కొండ, ఫతేదర్వాజ, జిన్సీబజార్‌లలోని పార్కులు అధ్వానంగా మారుతున్నాయి. సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో పార్కులలోని వస్తువులు శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. గోల్కొండ ఫతేదర్వాజ ప్రహరీని ఆనుకొని ఖాళీ ప్రదేశంలో గతంలో పార్కును ఏర్పాటు చేశారు. ఇందులో కుతుబ్‌షాహీ రాజుల కాలం నాటి రెండు ఫిరంగులు, ఒక పెద్ద సిమెంట్ నీటి పాత్ర ఏర్పాటు చేసి పచ్చని చెట్లను కూడా నాటారు. చుట్టూ ఇనుప ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేశారు. అయితే పచ్చని మొక్కల పరిరక్షణకు నీటిని పోయడం మరిచారు. దీంతో పార్కులో పచ్చదనం ఎప్పుడో మాయమైంది. పార్కులో ఏర్పాటు చేసిన రెండు ఫిరంగులు కూడా నానాటికి అధ్వానంగా మారుతున్నాయి. నీటి తొట్టి కూడా శిథిలమై పోయింది. ప్రస్తుతం ఈ పార్కులో ఉదయం, సాయంత్రం వేళల్లో పిల్లలు ఆడుకుంటున్నారు. మరోవైపు జిన్సీబజార్‌లో ఏర్పాటు చేసిన త్రికోణ పార్కు సైతం అధ్వానంగా తయారయ్యింది. పిల్లలు ఆడుకోవడానికి ఏర్పాటు చేసిన పరికరాలు ఒకొక్కటిగా పాడవుతు వస్తున్నాయి. పార్కుకు ఓవైపు చెత్తను డంపింగ్ చేస్తున్నారు. దీంతో సాయంత్రం పూట పార్కుకు వచ్చే వారికి దుర్గంధం వస్తుంది. పిల్లలకు వేసవి కాలం సెలవులు ఉండడంతో సాయంత్రం పార్కుకు వస్తారని పార్కులను శుభ్రం చేసి పిల్లలకు అందుబాటులోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

సేవా కార్యక్రమాలతోనే గుర్తింపు



అసోసియేషన్ ప్రతినిధులతో టీఎఫ్‌సీఓ చైర్మన్ నజీబ్

గోల్కొండ: సేవా కార్యక్రమాలతోనే ప్రజల్లో గుర్తింపు వస్తుందని తెలంగాణ ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఆర్గనైజేషన్ రాష్ట్ర చైర్మన్ మహ్మద్ నజీబ్ అన్నారు. ఆదివారం ఆయన టోలిచౌకీ అక్బర్‌బాగ్‌లోని తెలంగాణ ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఆర్గనైజేషన్‌లో యువజన సంఘాలు, టీఎఫ్‌సీఓ ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సేవా కార్యక్రమాలు నిర్వహించడం వల్ల యువకుల్లో ఆత్మస్థైర్యం పెరగడమే కాకుండా నాయకత్వ లక్షణాలు కూడా పెంపొందుతాయన్నారు. అంతేకాకుండా స్థానికంగా సైతం సేవా కార్యక్రమాలు నిర్వహించే వారికి మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఖాలేద్ అలీఖాన్, ముజీబ్, అబ్దుల్ సలాం ఉన్నారు.

తెలంగాణలో కాంగ్రెస్ విజయం ఖాయం



వలీ వుల్లా సమీర్‌ను సన్మానిస్తున్న కురాకుల కృష్ణ తదితరులు

గోల్కొండ: హైదరాబాద్ పార్లమెంట్ స్థానంతో పాటు తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాలు గెలుచుకుంటుందని ఆ పార్టీ హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అభ్యర్థి వలీ వుల్లా సమీర్ అన్నారు. కార్వాన్ నియోజకవర్గానికి చెందిన పలువురు సీనియర్ నాయకులు ఆదివారం ఆయనను కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పూలమాలలు వేసి సన్మానించారు. కార్వాన్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీకి అత్యధిక ఓట్లు వచ్చేలా కలిసికట్టుగా కృషి చేస్తామని ఈ సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నాయకులు కురాకుల కృష్ణ అన్నారు. అనంతరం వలీ వుల్లా సమీర్ మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన అతి కొద్ది కాలంలోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల సందర్భంగా ఇచ్చిన వాగ్దానాలను దశల వారీగా పరిష్కరిస్తున్నారన్నారు. ఆయనను కలిసిన వారిలో కాంగ్రెస్ నాయకులు చంటిబాబు, ఏ.చంద్రశేఖర్ తదితరులున్నారు.

హైదరాబాద్ సీటు మాదే: ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: హైదరాబాద్ లోక్‌సభ సీటు మాదేనని ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. ఆదివారం ఆయన టోలిచౌకీ యూసుఫ్ టెక్డీలో మజ్లిస్ ఎన్నికల కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..హైదరాబాద్‌లో మజ్లిస్‌కు పోటీ ఇచ్చే పార్టీ ఏది లేదని ఉనికికి కాపాడుకోవడానికే పార్టీలు పోటీ చేస్తున్నాయన్నారు. గతంలో సైతం మజ్లిస్ పార్టీకి ఓటమి తప్పదంటూ మజ్లిస్ వ్యతిరేకులు ప్రచారం చేసి బంగపడ్డారని ఆయన అన్నారు. మజ్లిస్ పార్టీ పనితనాన్ని చూసిన వారే మజ్లిస్‌కు ఓటు వేస్తున్నారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మజ్లిస్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, నాయకులు అజీజ్‌ఖాన్ పటాన్, హారూన్‌ఫరాన్, ఎంజేపీ గౌస్‌భాయ్, ఎక్బాల్ తదితరులున్నారు.

ప్రజానాయకుడిని గెలిపించాలి



ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న చంద్రకళ

మణికొండ: నిత్యం ప్రజల మధ్య ఉండి, వారి మేలు గురించి ఆలోచన చేసే కాసాని జ్ఞానేశ్వర్ లాంటి ప్రజానాయకుడిని గెలిపించాలని, వ్యాపారస్తులను కాదని జ్ఞానేశ్వర్ భార్య చంద్రకళ, కుమారుడు సాయిలు అన్నారు. ఆదివారం వారు నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని ఖానాపూర్ గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లా పరిషత్ చైర్మెన్, ఎమ్మెల్సీ, బీసీ నాయకునిగా కాసాని జ్ఞానేశ్వర్ ప్రజలకు ఎంతో సేవ చేశారన్నారు. చేవెళ్ల ఎంపీ అభ్యర్థిగా బరిలో దిగిన కాసాని జ్ఞానేశ్వర్ భారీ మెజారిటీ గెలిపించాలని ఓటర్లను కోరారు.

ఆరోగ్య పరీక్షలు అందరికీ అవసరం



క్లినిక్స్‌ను ప్రారంభించిన నరేందర్‌రెడ్డి

మణికొండ: ప్రస్తుతం వస్తున్న రోగాలను ఎప్పటికప్పుడు గుర్తించి వాటి నివారణకు చర్యలు తీసుకుని ఆరోగ్యంగా ఉండేందుకు ప్రతి ఒక్కరు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాల్సిన అవసరం ఎంతో ఉందని మణికొండ మున్సిపల్ వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని అలకాపూర్ టౌన్‌షిప్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన అపోలో షుగర్ క్లినిక్స్‌ను ఆదివారం ఆయన డాక్టర్ జె.జయప్రకాశ్‌సాయితో కలిసి ప్రారంభించి మాట్లాడారు. ప్రజలకు సమీపంలో మంచి ఆసుపత్రులు ఉండాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ శ్రీకాంత్‌స్వామి, ధాన్వీ హెల్త్‌కేర్ సీఈఓ డాక్టర్ కె. శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ వి. దీప్తి మన్నం పాల్గొన్నారు.

వాసవీమాత విగ్రహానికి పూజ



మణికొండ: వాసవీ క్లబ్ కపుల్స్ మణికొండ వారి ఆధ్వర్యంలో ఆదివారం వాసవీ మాత నూతన పంచలోహ విగ్రహానికి ఆదివాస పూజ నిర్వహించారు. మున్సిపాలిటీ పరిధిలోని అలకాపూర్ తుల్జారాంభాగ్ దేవాలయంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు వి.వంశీకృష్ణ మాట్లాడుతూ.. ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవం వాసవీమాత అని ఆమెను పూజించటం నిత్య కార్యక్రమంలో భాగంగా ఉంటుందన్నారు. ఆమె విగ్రహాన్ని నూతనంగా ఏర్పాటు చేయాలనే ఉద్దేశంతో దేవాలయానికి అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో యశ్వంత్, శిరీష, నిరీష, నవీన్‌కుమార్, రామ్‌సురేష్, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

హెల్త్ ఎక్స్‌లెన్సీ అవార్డు అందజేత



అవార్డును అందుకుంటున్న డాక్టర్ రామరాజు

శంషాబాద్: శంషాబాద్ పట్టణంలోని లిమ్స్ ఆస్పత్రి సేవలకు యాక్ట్‌నౌ సామాజిక సేవా సంస్థ ఏపీజే అబ్దుల్ కలాం హెల్త్ ఎక్స్‌లెన్సీ అవార్డును అందజేసింది. నగరంలోని హైటెక్స్‌లో జరిగిన కార్యక్రమంలో లిమ్స్ ఆస్పత్రి ఎండీ డాక్టర్ రామరాజుతో పాటు వైద్యులు డాక్టర్ విశ్వనాథ్, డాక్టర్ గోవర్ధన్‌రెడ్డి, డాక్టర్ సంతోష్‌కుమార్, డాక్టర్ విశాంత్‌రెడ్డిలు అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా రామరాజు మాట్లాడుతూ..కరోనా సమయంలో గర్భిణులకు వైద్యసేవలందించడంతో పాటు అనే ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించినందుకు గతంలో గవర్నర్ చేతుల మీదుగా ప్రత్యేక అవార్డును అందుకున్నట్లు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ తెలంగాణ చాప్టర్ చైర్మన్ అజయ్ మిశ్రా, ఐఏఎస్ అధికారి డాక్టర్ కస్తూరి శ్రీధర్ పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి అదృశ్యం



అజారుద్దీన్

అత్తాపూర్: ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ వెంకటరాంరెడ్డి, ఏఎస్ఐ మహమ్మద్ హర్షద్ అలీ, బంధువుల వివరాల ప్రకారం.. కిషన్‌బాగ్‌కు చెందిన మహమ్మద్ అజారుద్దీన్ (36) రాజేంద్రనగర్ మానసహిల్స్‌లో డాక్టర్ సందీప్ అతావత్ నివాసంలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నారు. చాంద్రాయణగుట్ట బాబానగర్ ప్రాంతానికి చెందిన ఫర్హానా బేగంను పెళ్లి చేసుకున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి అజారుద్దీన్ కిషన్‌బాగ్‌లో నివాసముంటున్నాడు. డాక్టర్ సందీప్ అతావత్‌కు సన్నిహితంగా ఉంటున్న ఆసీఫ్ అజారుద్దీన్‌కు మరింత బాధ్యతలు అప్పగించాడు. దీంతో నెలలో రెండు సార్లు మాత్రమే కుటుంబ సభ్యులతో కలిసి వచ్చేవాడని, ఈ సందర్భంలో తాను అవసరాల నిమిత్తం బంధువులు, స్నేహితుల వద్ద నగదు రూపంలో డబ్బులు తీసుకునేవాడని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. శుక్రవారం అత్తాపూర్ చింతల్‌మెట్ ప్రాంతంలో ఉన్న ఇండియన్ గ్యాస్ వద్దకు వచ్చి అక్కడ చెరుకు బండి ఏర్పాటు చేసుకున్న శ్రీను అనే వ్యక్తి వద్ద తన యాక్టివా తాళం ఉందని అజారుద్దీన్ అతని బామ్మార్ది ఫిరోజ్‌కు ఫోన్‌లో సమాచారం ఇచ్చాడు. కాసేపటి తర్వాత ఇండియన్ గ్యాస్ గోదాం వద్దకు వచ్చిన ఫిరోజ్‌కు ఎంతసేపైనా బావ అజారుద్దీన్ జాడ కనిపించలేదు. అతడికి ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. 'నేను చాలా ఒత్తిడికి గురవుతున్నానని నేను చనిపోతే వచ్చే ఇన్సూరెన్స్ డబ్బులు కుటుంబానికి ఇవ్వాలని' కోరుతూ స్నేహితులు, బంధువులకు వాయిస్ మెసేజ్ పంపించి కనిపించకుండా పోయాడు. ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

అత్తాపూర్: గుర్తుతెలియని మృతదేహాన్ని అత్తాపూర్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కానిస్టేబుల్ నరేష్ రెడ్డి వివరాల ప్రకారం ..అత్తాపూర్ భరత్‌నగర్ కాలనీలో గుర్తుతెలియని ఓ వ్యక్తి (50) మృతదేహం ఉన్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించగా ఎలాంటి ఆధారాలు లభించలేదు. ఎండ తీవ్రతకు చనిపోయి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు.